క్లుప్తంగా

నేడు జగ్జీవన్ రామ్ జయంతి

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో బుధవారం భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి కార్యక్రమాన్ని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ ప్రత్తిపాడు నియోజకవర్గ కన్వీనర్ టి.ఏసుపాదం, ఎంఎస్పీ సీనియర్ నాయకుడు డి.సాంబయ్య మాదిగ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బస్టాండు సెంటరులోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద వేడుకలు జరుగుతాయని, ప్రజలు పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి

గుంటూరు రూరల్: నగరంలోని బ్రాడీపేటలో ఉన్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయంలో బుధవారం ఉదయం 9:30 గంటలకు భారత మాజీ ఉప ప్రధాని, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పేర్కొన్నారు.

శివాలయంలో కారుణ్య నియామకం

పెదకాకాని : స్థానిక శివాలయంలో కారుణ్య నియామకం ద్వారా అంకమ్మరావుకు ఉద్యోగం కల్పించినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ ఉల్లంగుల వీర వసంత రావు మరణించారని, ఆయన కుమారుడు అంకమ్మరావును అటెండర్‌గా నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. క్రింద అంకమ్మరావుకు ఉద్యోగ నియామక పత్రం అందజేశారు.

నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దేవాదాయ ధర్మాదాయశాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పెదకాకాని శివాలయంలో గత ధర్మకర్తల మండలి పదవీ కాలం ముగియడంతో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ధర్మకర్తలుగా నియామకానికి ఆసక్తి కలిగిన వారు ఆలయ పని వేళల్లో అప్లికేషన్ పొందాలన్నారు. అభ్యర్థులు ఏప్రిల్ 24వ తేదీ లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు కార్లు ఢీకొని.. రోడ్డు పక్కన వెళ్తున్న ఇరువురికి గాయాలైన ఘటన నారాకోడూరులో మంగళవారం జరిగింది. తెనాలి చెంచుపేటకు చెందిన కె.శివమ్మ, చేబ్రోలు యడ్లపాటి నగర్‌కు చెందిన డి.తిరుపతయ్య నారాకోడూరు శివారులోని ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద జీబీసీ రహదారి పక్కన ఉన్నారు. పొన్నూరు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారును ఓవర్ టేక్ చేసే సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని మరో కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అదుపుతప్పిన కారు మేనత్త, అల్లుడైన శివమ్మ, తిరుతయ్యను ఢీకొంది. శివమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక శాస్త్రాలతోనే మహోన్నత సమాజం



లక్ష్మీపురం: సామాజిక శాస్త్రాల అధ్యయనంతో మహోన్నత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని విశ్రాంత సోషల్ సైన్సెస్ అధ్యాపకులు ఎస్.రవిబాబు చెప్పారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మేధావులు విశ్లేషణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రవిబాబు మాట్లాడుతూ సామాజిక అంశాలపై అవగాహనతో భవితను చక్కగా తీర్చిదిద్దుకోగలమన్నారు. అర్థశాస్త్ర సీనియర్ అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ చదువుతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. సమావేశంలో విశ్లేషకులు ఇ.చంద్రయ్య, పి.ఎస్.మూర్తి, సింగరయ్య, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొగల్ చక్రవర్తుల పాఠ్యాంశాన్ని పునరుద్ధరించాలి

లక్ష్మీపురం: మొగల్ చక్రవర్తుల పాఠ్యాంశాన్ని తొలగించడం అన్యాయమని నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం జాతీయ చైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ డిమాండ్ చేశారు. స్థానిక లాలాపేటలోని షాహి జామియా మసీదు (పెద్ద మసీదు) ప్రాంతంలోని మహబూబ్ సుభాని జెండా చెట్టు వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భావితరాలకు మొగల్ చక్రవర్తుల చరిత్ర తెలియాల్సిన అవసరం ఉందని, వారి పాఠ్యాంశాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు షఫీబేగ్, రఫీబేగ్, రియాజ్ బేగ్, హాజీ బేగ్ ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం..

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ స్థానిక ఓబులునాయుడు పాలెంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కేశం శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఆమె గడప గడపకు వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు కేశం హరనాథ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో పార్టీ శ్రేణులు సుచరితకు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన మేకతోటి సుచరిత లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. చిన్నపాటి సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గాలు చూపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించలేదన్నారు. దేశ చరిత్రలో జగనన్న సంక్షేమ పాలన ఒక సువర్ణ అధ్యాయమని అభివర్ణించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నను మరలా గెలిపించుకునేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో మాదిరిగా సంక్షేమ పథకాల కోసం.. జన్మభూమి కమిటీల వద్దకు వెళ్లి నిలబడే దుస్థితి ప్రస్తుతం లేదన్నారు. వలంటీర్లే ఇంటివద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందించే పరిస్థితులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ముజావర్ షేక్ గుల్జార్ బేగం, మండల కన్వీనర్లు ఆళ్ళ రవిదేవరాజు, గట్టు విజయ్ కుమార్, దుపాల రాధ, మబ్బు సుదాకర్, తురకపాలెం సొసైటీ చైర్మన్‌లు తంగెళ్ళ నాగేశ్వరరావు, నాగం కాశీవిశ్వనాథం, ఎంపీడీఓ శోభరాణి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వంగా నవీన్‌రెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ మందాడి నారాయణమ్మ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, , పీఏసీఎస్ చైర్మన్ తంగెళ్ళ నాగేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ పుట్టా బాజీ, మన్నెం లక్ష్మి, కందుకూరి జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎస్‌సీతో విజ్ఞాన్ గ్రూప్ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను సీఈఓ శ్రీకాంత్‌కు అందజేస్తున్న రిజిస్ట్రార్ శ్రీధర్ వారియర్

చేబ్రోలు: విజ్ఞాన్ విద్యా సంస్థల గ్రూప్ బెంగళూరులోని ఐఐఎస్‌సీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను విజ్ఞాన్ గ్రూప్ వైజాగ్ సీఈఓ నందిగం శ్రీకాంత్‌కు ఐఐఎస్‌సీ బెంగళూరు రిజిస్ట్రార్ శ్రీధర్ వారియర్ అందజేశారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మంగళవారం సీఈఓ నందిగం శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. కర్ణాటకలోని విద్యా సంస్థలతో కాకుండా వెలుపలి రాష్ట్రాల్లోని ప్రైవేట్ విద్యా సంస్థలతో ఐఐఎస్‌సీ బెంగళూరు అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని విజ్ఞాన్ గ్రూప్ విద్యార్థులకు సైన్స్‌తో పాటు మ్యాథమెటిక్స్ సబ్జెక్టులను సులభంగా బోధించడంతో పాటు బోధనా నాణ్యతను పెంచి ఎక్స్‌పరిమెంటల్ లెర్నింగ్‌ను అందించడానికి ఉపయోగపడుతుందన్నారు.

వేగంగా గాంధీ పార్కు ఆధునికీకరణ



గాంధీపార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: గాంధీ పార్కు ఆధునికీకరణ పనులు వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని మార్కెట్ సెంటర్‌లో సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలోని గాంధీ పార్కులో రూ.5 కోట్లతో చేస్తున్న ఆధునికీకరణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మేయర్ పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ గాంధీ పార్కులో గ్రీనరీని అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడించారు. పిల్లల కోసం చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్మెంట్, పెద్దలకు ఓపెన్ జిమ్, స్కేటింగ్ పరికరాలు, ఫౌంటెయిన్, సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం త్వరగా పూర్తిచేయనున్నట్టు వెల్లడించారు. నగర పరిధిలో సుమారు 52 ఎకరాల విస్తీర్ణంలో మానస సరోవరం పార్కు అభివృద్ధికి నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్ పోతురాజు సమత, ఎస్ఈ భాస్కర్ రావు, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఏడీహెచ్ రామారావు, డీఈఈ కళ్యాణ్‌రావు, శ్రీనివాసరెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్య విభాగానికి సక్షన్ ఆపరేటర్ వితరణ



సక్షన్ ఆపరేటర్ మిషన్‌ను డాక్టర్ ప్రభావతికి అందజేస్తున్న మండవ శ్రీనివాస్, ప్రదీప్ చౌదరి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఈఎన్‌టీ వైద్య విభాగానికి సుమారు రూ.25వేలు ఖరీదు చేసే సక్షన్ ఆపరేటర్ వైద్య పరికరాన్ని మంగళవారం గుంటూరు జీజీహెచ్ కుటుంబ నియంత్రణ విభాగం రిటైర్డ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మండవ శ్రీనివాసరావు, ఆయన కుమారుడు డాక్టర్ మండవ ప్రదీప్ చౌదరి వితరణగా అందజేశారు. గుంటూరు వైద్య కళాశాలలో ఇటీవల ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని 2017 అవుట్‌గోయింగ్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ మండవ ప్రదీప్ చౌదరి ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్ కోరిక మేరకు వైద్య పరికరాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి డాక్టర్ మండవ శ్రీనివాస్‌ను, డాక్టర్ మండవ ప్రదీప్ చౌదరిని అభినందించారు. డాక్టర్ మండవ శ్రీనివాస్ జీజీహెచ్‌కు పలుమార్లు పరికరాలు అందించారని వివరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

ఎయిమ్స్‌కు తీరనున్న నీటి సమస్య



ఎయిమ్స్ ఆవరణలో జరుగుతున్న తాగునీటి సంపు నిర్మాణం

మంగళగిరి: ఎయిమ్స్‌కు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఏడాది రూ.8 కోట్లతో పనులు చేపట్టింది. ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎయిమ్స్‌కు అవసరమైన మూడు నుంచి నాలుగు ఎంఎల్‌డీల సామర్థ్యంతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు, సంపుల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. గుంటూరు చానల్ నుంచి ఆత్మకూరు చెరువుకు నీరు మళ్లించి అక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రికి నీరు అందించేందుకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి కావొస్తున్నాయి. ఎయిమ్స్ ఆవరణలో ఆయా బ్లాకులకు దగ్గరగా తాగునీటి సంపులు, ట్యాంకులు నిర్మిస్తున్నారు. ఆరు సంపులు, ట్యాంకులలో ఇప్పటికే సగభాగం పూర్తి కాగా మిగిలిన పనులు మరి కొద్దిరోజుల్లో పూర్తి కానున్నాయి. దీంతో ఎయిమ్స్‌కు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. ప్రస్తుతం ఆసుపత్రి అవసరాలకు మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ నుంచి ట్యాంకర్ల ద్వారా ఆరు లక్షల లీటర్ల నీరు, తాడేపల్లిలోని పవర్ బోర్ల ద్వారా మరో 2లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజూ ఎయిమ్స్ అవసరాలకు 8 లక్షల నుంచి 10 లక్షల లీటర్ల నీరు అవసరం అవుతుంది. ఎయిమ్స్‌లో అన్ని విభాగాల్లో వైద్య సౌకర్యాలు అందుతుండటంతో రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2500 – 3వేల మంది రోగులు వైద్య సేవలను అందుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శాశ్వత తాగునీటి పథకం త్వరితగతిన పూర్తి చేసి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఎయిమ్స్‌కు శాశ్వత నీటి సమస్య తీరనుందని ప్రజారోగ్యశాఖ అధికారులు తెలిపారు.

పెండింగ్ బీపీఎస్ దరఖాస్తుల పరిష్కారానికి మరో అవకాశం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 2019లో వచ్చిన బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) దరఖాస్తుల రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. 2019 సంవత్సరానికి ముందు ప్లాన్ లేకుండా భవనాలు నిర్మించుకున్న వారు, తీసుకున్న ప్లాన్‌కు భిన్నంగా నిర్మాణం చేపట్టిన వారికి బీపీఎస్ వర్తిస్తుంది. గుంటూరు నగరంలో బీపీఎస్ కింద 2,448 దరఖాస్తులు అందాయి. వాటిలో 2,065 అప్రూవల్ అయ్యాయి. ఇంకా పెండింగ్‌లో 241 ఉన్నాయి. మిగిలిన దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తిరస్కరించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 241 దరఖాస్తులను ప్రాసెస్ చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు సంబంధించి పెనాల్టీలు ఫీజులు రూపంలో చెల్లించి ఆయా భవనాలను రెగ్యులరైజ్ చేసుకునేందుకు జూన్ నెలఖారు వరకు గడువు ఉంది.

అమ్మవారికి లక్ష మల్లె పూల పూజ



పెదనందిపాడు: నుసలమ్మ పోతురాజు స్వామి దేవస్థానంలో అమ్మవారికి లక్ష మల్లెపూల పూజ ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి మండల పరిధిలోని అన్నపర్రు గ్రామంలోని నుసలమ్మా పోతురాజు స్వామి దేవస్థానం లో మల్లె పూల పూజ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధైర్యలక్ష్మి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు మంగళవారం తిరుమంజన సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళా శాసనములతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రథమ వార్షికోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ధైర్యలక్ష్మి, రాజ్యక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి తిరుమంజన సేవ నిర్వహించామన్నారు. 10 గంటల నుంచి 12 గంటల వరకు 9 సన్నిధులలో కనకాంబరం పుష్పాలతో సహస్రనామార్చన, కుంకుమార్చన నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపాఠశాల విద్యార్థులు, విజయకీలాద్రి అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలపై శిక్షణ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక కేంద్రం వైద్యులు డాక్టర్ కేవీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న సేవల గురించి జిల్లా ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ ఎస్. బాలస్వామి ఆరోగ్యమిత్ర సిబ్బందికి, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారని అన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ శిక్షణ మ్యాన్యువల్ బుక్‌లెట్‌ని ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నాగేంద్ర బాబు, డాక్టర్ మానస, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ ఎస్.బాలస్వామి, కె.సూర్యనారాయణ, సీహెచ్ఓ గురుకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడ పిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అమ్మవారిని చైత్ర మాసం మొదటి మంగళవారం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి



ప్రత్తిపాడు మెయిన్ రోడ్‌లో మానవహారంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీరమ్య

ప్రత్తిపాడు: ప్రతి ఒక్కరూ తమ ఆధార్ డాక్యుమెంటేషన్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య చెప్పారు. ప్రత్తిపాడులో ఆధార్ అప్‌డేట్‌పై ఎంపీడీఓ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి ఇందిరా గాంధీ బొమ్మ సెంటరు వరకు ప్రదర్శన చేసి, పాతమల్లాయ పాలెం కూడలిలో అధికారులు, సచివాలయ సిబ్బంది మానవ హారంగా ఏర్పడి ఆధార్ నవీకరణ ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీరమ్య మాట్లాడుతూ 2016 కన్నా ముందు ఆధార్ తీసుకున్న వారు కచ్చితంగా నవీకరణ చేసుకోవాలన్నారు. ప్రత్తిపాడు-1 గ్రామ సచివాలయంలోని ఆధార్ నమోదు కేంద్రంలో ప్రజలు తమ ఆధార్ కార్డును నవీకరించుకోవచ్చని తెలిపారు. బ్యాంకు ఖాతాకు, పాన్ కార్డుకు కూడా తమ ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డును బ్యాంకుతో లింక్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వం పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేయబడతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ రామకోటయ్య, ఈఓపీఆర్డీ ఎం.మోషె, సెక్రటరీ వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు లక్ష మల్లెల పూజ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

కొండపాటూరు(కాకుమాను): కొండపాటూరులో స్వయంభూ కొండపాటూరు పోలేరమ్మ తల్లికి మంగళవారం రాత్రి లక్ష మల్లెల పూజా కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మ వారికి పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ గావించి, విశేష పూజలు నిర్వహించారు. ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన మహిళా భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయ చైర్‌పర్సన్ రామినేని నాగవేణి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈఓ సురేష్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీ స్క్రీన్‌లు ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాకుమాను, పెదనందిపాడు ఎస్ఐలు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా ఈ నెల 11న అమ్మ వారికి కుంకుమ పూజా కార్యక్రమం, తిరునాళ్ల, శిడిమాను మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు చైర్మన్ రామినేని నాగవేణి, తిరుపతిరావు దంపతులు తెలిపారు.

సాంకేతి రంగంలో సైబర్ సెక్యూరిటీకి అధిక ప్రాధాన్యం



బహుమతులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: సైబర్ సెక్యూరిటీ అనేది ప్రపంచ సాంకేతిక రంగంలో చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందని విజయవాడకు చెందిన సుప్రజ టెక్నాలజీస్ సీఈఓ సీహెచ్ సంతోష్ తెలిపారు. మంగళవారం లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా కళాశాల, సుప్రజ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న సైబర్ సెక్యూరిటీ హ్యాక్ థాన్ సదస్సు ముగిసింది. ముగింపు వేడుకల్లో సీఈఓ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ ప్రాథమిక పరిభాషలు, స్నిఫ్ఫింగ్ టూల్స్, స్టెనో గ్రఫీ, వెబ్ అప్లికేషన్స్‌పై జరిగే దాడులు తెలిపారు. ఈ-మెయిల్ స్పూఫింగ్, ఎథికల్ హ్యాకింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులతో స్వయంగా అప్లికేషన్స్ తయారు చేయించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గురువు పరబ్రహ్మశాస్త్రి



పరబ్రహ్మశాస్త్రి శత జయంత్యుత్సవ సభలో మాట్లాడుతున్న ఎన్నారై రత్నాజీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలూ శ్రమించిన పరబ్రహ్మ శాస్త్రి ఆదర్శ గురువుగా నిలిచారని ప్రవాసాంధ్రుడు జె.రత్నాజీ చెప్పారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మంగళవారం కళాశాల విశ్రాంత వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు జె.పరబ్రహ్మశాస్త్రి శత జయంత్యుత్సవ సభ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రత్నాజీ మాట్లాడుతూ ఉత్తమ తండ్రిగా, అధ్యాపకునిగా, వాణిజ్య శాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన పరబ్రహ్మ శాస్త్రి తనయుడిగా జన్మించడం తన అదృష్టమన్నారు. కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ తన శిష్యులను కన్నబిడ్డలుగా భావించి, వృత్తికి సంపూర్ణ న్యాయం చేసిన ఆదర్శమూర్తి పరబ్రహ్మశాస్త్రి అని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి ఐ.శాంతిలత, వైస్ ప్రిన్సిపాల్ కె.దుర్గాప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్, ఎంవీఆర్‌కే ముత్యాలు, ఆడిటర్ దివాకర్, ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జె.కృష్ణకుమారి పరబ్రహ్మశాస్త్రి వృత్తి, జీవిత విశేషాలను వివరించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశవిదేశాల్లోని పరబ్రహ్మశాస్త్రి సన్నిహితుల ప్రసంగాలను స్క్రీన్‌పై ప్రదర్శించారు.

రూపాయి తేడా వచ్చినా రాజీనామా చేస్తాం

టీడీపీ నేతలకు అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌కర్నుమా సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్‌కర్నుమా, పక్కన రసూల్ తదితరులు

పట్నంబజారు: నిస్వార్థంగా అంజుమన్ కమిటీ ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి పాటుపడుతోందని, అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోందని, అభివృద్ధిని ఓర్వలేక కొన్ని దుష్టశక్తులు దురుద్దేశంతో బురదజల్లే యత్నం చేస్తున్నాయని అంజుమన్ కేర్ టేకర్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌కర్నుమా మండిపడ్డారు. పొన్నూరు రోడ్డులోని అంజుమన్ పాఠశాలలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంజుమన్ కేర్ టేకర్ కమిటీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్క రూపాయి అవినీతి జరిగిందని నిరూపించినా.. తామంతా రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. అంజుమన్ సంస్థలపై కొంత మంది టీడీపీ నేతలు కావాలనే వారి మనుగడ చాటుకునేందుకు లేనిపోని నిందలు మోపటం సరికాదన్నారు. అంజుమన్ సంస్థ ద్వారా ముస్లిం మైనార్టీలకు మేలు చేకూరేలా ఇస్లామిక్ లైబ్రరీ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఐదు ఎకరాల స్థలం కేటాయించేందుకు పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. దీనికి తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అంజుమన్ స్థలాలు ధారాదత్తం చేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించటం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ గులాం రసూల్ మాట్లాడుతూ టీడీపీ నేతలు కేవలం దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇస్లామిక్ లైబ్రరీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తుంటే అభాండాలు వేయటం దుర్మార్గమన్నారు. రంజాన్ మాసం పూర్తికాగానే బహిరంగ చర్చకు సిద్ధమని, మీడియా ఎదురుగా డిబేట్ ఎక్కడైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. సమావేశంలో కార్పొరేటర్‌లు మెహమూద్, ఆబిద్‌బాషా, అంజుమన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.